# 8

# నీళ్ళు

*"గర్ర్... గజ్... జ్... ర్... ర్.." మంటూ ఎక్కడ్నుండో దూసుకు వస్తోన్న చప్పుడు. ఈసారి అది గాలి కాదు... నీళ్ళు... నీళ్ళు... నీళ్ళు... నీళ్ళ నీళ్ళు... ధారగా నీళ్ళు... దిగుల్లేకుండా నీళ్ళు... నీళ్ళు...*

**కొ**ళాయి తిప్పేవుందని తెలీక మళ్ళీ తిప్పబోయింది మల్లిక.

గర్... గజ్... ర్... జ్... ర్... మంటూ ఎక్కడ్నుండో ఏదో దూసుకువస్తోన్న చప్పుడు. అది నీళ్ళు కాదు... గాలి...

మల్లిక కడుపులో ఏదో కదిలినట్ట యింది. ఏవో దిగుళ్ళు.

"ఇంత రేత్రిదాకా యాడికిబోయి నాడో... ఇంకా రాలేదంటమ్మే మల్లికా..." మూలిగినట్టుగా అడిగింది మునుగుతీసి కన్నెమ్మ.

"రాలేదత్తా, వస్తాడ్లే. నువ్వు పొణుకో..." రెడ్డోరి తోటలో నుండి నీళ్ళబిందె తెస్తూ చెప్పింది మల్లిక.

తలమీది నుండి కుడిచేత్తో తొలగించిన దుప్పటిని మళ్ళీ ముసుగేసుకుంటూ 'నీళ్ళు తెస్తుండాది గావాల' గొణుక్కుంది లోలోపలే, బిందె దించిన శబ్దం విని.

వాకిట్లో వున్న చింతచెట్టు మీది నుండి ఎండిన కొమ్మొకటి జారి చెట్టు కిందున్న

టైరుబండి మీద పడి వింతశబ్దం చేసింది. అప్పటిదాకా ఆ కొమ్మమీద కూర్చుని కునుకుతీస్తోన్న పక్షి ఏదో ఉలిక్కిపడి వికృతంగా అరుచుకుంటూ వెళ్ళింది.

"ఏందక్కా యిది... ఎట్టబొయినాడు మావ. దినమ్మూ యింతేనా? ఈ పొద్దేనా?"

"లేదులేరా, రెడ్డింటి కాడ సంబరాలు జరుపుకుంటుండారు గదా... సాయంత్రం పంచాయతాఫీసు కాడ్నుండి రాను ఆలస్యమైగాని... నేను మాత్రం యింత రేత్రిదాకా తెస్తానా నీళ్ళు?"

తానసలేమీ కష్టపడడం లేదని తమ్ముడనుకోవాలన్నట్టుగా చెప్పింది మల్లిక.

"ఏందికా నువ్వింకా నీళ్ళు తెచ్చేది... నువ్విప్పుడు సర్పంచివి. ఈ వూరికే రాణివి... అసలు సంబరాలు జరుపుకోవల్సింది మనం..." తనుకూడా అక్కతోపాటే రెడ్డోరి తోటబావికాడికి నడుస్తూ అన్నాడు రమణ.

"మనం గెలిచినామంటే మన గొప్పంట్రా... వాళ్ళు నిలబెడితేనే గదా గెలిచినాం. నారాయణరెడ్డి మన తట్టు తిరగబట్టేగదా ఓట్లు పడ్డాయి. ల్యాకుంటే మన మొహం చూసి వోట్లు యేసేదెవురు?" వడివడిగా అడుగులేస్తూ వెళ్ళి బిందెదించి చేదబావిలో వేసింది... బరువుగా రెండు బక్కెట్లు లాగి బిందెనింపి చంకనేసుకుని 'స్స'మంటూ వెనుతిరిగింది. అక్క కష్టాన్ని చూస్తూ మరో బిందె నింపి భుజానికెత్తుకున్నాడు రమణ.

"ఇంక చాల్లేరా," ముందు నడుస్తూ చెప్పింది మల్లిక.

"అక్కా గెల్చిన సర్పంచివి నువ్వీడుంటే, అప్పటికి వాళ్ళాడ ఎవుర్నిబెట్టి వూరే గిస్తుండారు... అసలు గెలిచింది నువ్వా వాళ్ళా?" రమణ గొంతు కసిగా ఆలోచనగా వుంది. బిందె మోస్తూ గబగబా వచ్చి అక్కని కలవడంతో గసగాకూడ వుంది.

"మనమేలేరా, రెడ్డి నిలబెడితేనేగదా గెల్చినాం. అంతవరకూ నిజమేలే," ఏదో వొకటి అనాలన్నట్టుగా అన్నది మల్లిక.

"అయితే అబద్ధమేందంటావు," నవ్వాడు రమణ.

"పోరా నాయినా, మీ టౌనోళ్ళతో మా పల్లెటూరోళ్ళం ఏం మాట్లాడతాం... ఈడ మేం గెల్చినా కూడా రెడ్లే సర్పంచులు... సరేనా?" బిందెని ఎడన చంకలో నుండి కుడి చంకలోకి మార్చుకుంటూ అన్నది మల్లిక.

"అంటే వూరేగింపుక్కూడా సర్పంచి అవసరంలేదా... అంటే నిన్ను కాకుండా బావని పక్కనబెట్టుకుని ఊరేగతారన్నమాట."

తమ్ముడి మాటలకు విసుగ్గా ఎడమ అరచేత్తో నుదురు కొట్టుకుంది మల్లిక.

"ఏదోవొక మొత్తుకోళ్ళులేరా... ఇదిగో ఇప్పుడన్నా మన బతుకులు బాగుపడ్తా యేమో. చూద్దాం... ఒకాశ," ఆరుబయట తొట్లో వొంపి ఖాళీబిందెని అరుగుమీదాన్ని, తమ్ముడి భుజంమీది నుండి బిందెనందుకుంటూ చెప్పింది మల్లిక.

అరుగు మీద గుంజకానుకుని చతికిలబడి అక్కకేసి నిశితంగా చూస్తున్నాడు రమణ. మల్లిక కూడా వచ్చి అదే అరుగుమీద గోడకానుకుని కూర్చుంటూ, "నువ్వు తినేయరాదంట్రా," అంది.

"వచ్చినాడంటమ్మే," మరో అరుగుమీద పడుకున్న కన్నెమ్మ ముసుగుతీసి మళ్ళీ అడిగింది.

"ప్చ్... వొస్తాళ్ళే అత్తా," విసుక్కుంది మల్లిక.

"అత్తకి యిప్పుడు గూడా ఎంత తపనోజూడు కొడుకంటే," ముసుగేసుకుని ముడుచుకుని పడుకుని మూలుగుతోన్న ముసల్దానికేసి తదేకంగా చూశాడు రమణ.

గాలి వేపాకులతో కలిసి గలగలమని పాటలు పాడుతోంది. కాసేపు ఇద్దరిమధ్య నిశ్శబ్దం.

"అయితే అక్కా సర్పంచ్ అయ్యావుగదా నీకేం చెయ్యాలనుంది?"

"ప్చ్..." విసుక్కుంటూనే తమ్ముడికేసి తిరిగి మళ్ళీ రమణ ముఖం చూసి నవ్వేసింది మల్లిక.

"ప్చ్... మనవేం చేయగలంరా. పోయిన్నారి గెలిచింది చూడు పాతూరి రవణమ్మ ఇప్పుడు మనకెదురుగ్గా నిలబడిందే పోలమ్మ... ఆ పోలమ్మ చెల్లెలు రవణమ్మ... సర్పంచయి ఏం చేసిందిరా... అంతా నాయుడోళ్ళదే గదా రాజ్యం. పాపం చచ్చేంతదాకా రాళ్ళు కొడతానే గదరా వుణ్ణింది రవణమ్మ. ఆ ఎండన బడి రాళ్ళు కొట్టలేకే గదా పెద్దోళ్ళు చెప్తానే పుడింగి మాదిర నిలబడేసింది, పెసిడెంటైపోవాలని... ప్చ్... ఇద్దరు పిలకాయలు... మొగుడు చూస్తే మొక్కచీకలయిపాయె. సంతకాలు పెట్టించుకునే దంట్రా... అంతే... పంచాయతాఫీసు కాడికి కూడా పొయ్యేరగదనుకోయేమి," చెప్పింది దిగులుగా.

"అట్టనే కంకర కొట్టి కొట్టి దగ్గి దగ్గీ ఆ బిడ్డలిద్దరికీ పెట్టి పస్తులుండేది. అట్నే పాయింది. ప్చ్..." చెయ్యి తిప్పింది మల్లిక.

తమకి ఎన్నికల్లో అపోజిషన్ నిలబడి ఓడిపోయిన పోలమ్మ చెల్లెలు గురించి అక్క జాలిపడ్డం వింతగానూ, సంతోషంగానూ వుంది రమణకి. అదే అన్నాడు.

"ఒరేయ్ ఈ పాడుబడ్డా ఎలచ్చన్లొచ్చి మనకూ మనకూ పెట్టినాయిగానీ అంతకు ముందంతా అందరం కలిసిమెలిసి బతికినోళ్ళమేగదరా. అందరం కలిసి నాట్లకు పొయ్యేది... అందరం కలిసి రాళ్ళు మోసేది... కంకర కొట్టేది... అందరం కలిసి మక్తాకి కూడా చేసేదేగదరా. నాట్లేసేటప్పుడు రవణమ్మ గొంతెత్తితే మేమందరం కలిసి పాడినోళ్ళవే గదరా. అసలు రవణమ్మ పాడినట్టు పాటలు ఒక్కరు పాడగల్రా మన యిలాకాలో. ప్చ్..." కళ్ళు తుడుచుకుంది మల్లిక.

"అయితే ఈ ఎలక్షన్లు రావడం తప్పంటావా?"

"అయ్యన్నీ నాకు తెలీదురా నాయనా... తప్పో వొప్పో... అయితే ఈ ఓట్లు వచ్చినాపాట్నే గదరా మనం మనుషులుగా కనపడ్డాం వూరోళ్ళకి. అంతకుముందంతా మనకు ఇంటిపేర్లున్నాయా? మా అత్తని కదిలిచ్చు రేప్పొద్దున చెప్తాది. వోట్ల పండగొచ్చినా పాట్నేగదా యాడాడ అడవుల్లో పసలు గాసుకుంటా, కంపగొట్టుకుంటా వుండేవాళ్ళని గూడా ఎతుక్కుంటా వచ్చి పేర్లు రాయించినారు. అప్పుడే మనకి యింటి పేరొచ్చింది అంటాది. చానా ఏళ్లు ఓట్లు ఎయిను పొయ్యేదే లేదంట మనోళ్ళంతా తెలుసునా?"

అమాయకంగా చెప్పుకుపోతున్న అక్కని అడ్డుకోవడం యిష్టం లేనట్లుగా పూర్తిగా మాట్లాడనిచ్చి కాసేపాగి అడిగాడు రమణ.

"అయితే ఇప్పుడు నువ్వు సర్పంచివయ్యావు. రవణమ్మ మాదిర్నే పంచాయతా ఫీసుసాయ తొంగి చూడకుండా వుండేస్తావా... ఏ వన్నా చెయ్యాలనుందా?" తాగుబోతు మొగుణ్ని పెట్టుకోని మల్లిక ఏదైనా చెయ్యగలదో, లేదో రమణకి తెలీకుండా ఏంలేదు. అయినా అక్క ఏం చెప్తుందో వినాలనుకున్నాడు. బావ వచ్చేదాకా కాలాన్ని ఎగదొయ్యాలని కూడా అనుకున్నాడు.

కొంచెంసేపు మౌనందాల్చింది మల్లిక.

అర్ధరాత్రి దాటడానికింకా అయిదు నిమిషాలున్న ఆ సమయమూ, వీధీ కూడా చాలా మౌనంగా వున్నాయి.

అప్పటిదాకా బిందెలు పట్టుకుని అటూయిటూ తిరిగిన ఆడవాళ్ళంతా కూడ ఎవరిళ్ళల్లోకి వాళ్ళు... గెలిచిన సంబరంతో తాగి తూలుతూ, తత్వాలు పాడుతూ వుండిన ముసలి మొగవాళ్ళూ వాళ్ళ కలుగుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయినట్టున్నారు.

"ఇంకా రాలేదంటమ్మే మల్లికమ్మా... ఎట్ట సంసారంజేస్తావిట్టాటి మొగుణ్ణి పెట్టుకోని," ఈసారి కోడలు సమాధానాని కెదురు చూడకుండానే గొణుగుతూ ముసుగు లాక్కుంది ముసలమ్మ.

"చెప్పక్కా," మౌనంగా వుండిపోయిన మల్లికని కదిలించాడు రమణ, రెండు కాళ్ళూ ఎత్తి అరుగు మీద పద్మాసనం వేసుకుని కూర్చుంటూ. మల్లిక కూడా మోకాళ్ళ చుట్టూ చేతులు వేసుకు కూర్చుని పొడి దగ్గు దగ్గింది.

"నాకేం ఆశలుండాయిరా... పిలకాయిలు కూడా ల్యాకపోతిరి... నాకేంలేదురా. యిదిగో ఈ ఆడోళ్ళంతా నీళ్ళకోసం యింతింత కష్టాలు పడతుండారు... రెడ్డోరితోటలో మోటరేస్తేనే నీళ్ళు. ల్యాకపోతే లేదు. ఈ నడమ ఎలచ్చన్లని దినుమ్మూ యాస్తున్నారు. యిహన ఈ నీటిచుక్కకి కూడా అల్లాడాల్సిందే. ఒకపూట పైకి పోసుకుంటే రెండు దినాలు పోసుకునేది ల్యా. ఈదిబావుల్లో చేదుకుందావన్నా పాతాళంలోవుండె నీళ్ళు. మన మాలాడకీ , మాదిగాడకీ నీళ్ళు తెచ్చుకోవాలిరా... యింకోటేందంటే ఆడోళ్ళకి బయిటికి పోవాలంటే నిండా యిబ్బందిగా వుంది. చెట్లూ, పుట్టలూ కూడా ల్యాకుండా పాయె. గబక్కన పోవాలంటే యాడకని పరిగిస్తారు చెప్పు... ఆడోళ్ళకి బాధ ల్యాకుండా

కక్కసుదొడ్లు కట్టించుకోవాలిరా..." ఒక ట్రాన్స్‌లోలా మాట్లాడుతోన్న అక్కకేసి ఆశ్చర్యంగా చూస్తున్నాడు రమణ.

నిజానికి ఏదో నిలబెడ్తే నిలబడి గెలిచేసిందేకాని యిట్లా అక్కకి కొన్ని ఆలోచన్లూ, ఆశయాలూ వుంటాయని అతడూహించలేదు. అడివికిపోయి కట్టెలు కొట్టుకొచ్చుకునే అక్క... ఆమడదూరం నుండైనా నీళ్ళబిందెలు మోసే అక్క... కలుపు తీసే అక్క... పాటలు పాడే అక్క... బర్రెల్ని మేపుకొచ్చే అక్క... మొగుడిచేత లెస్స తన్నులు తినే అక్క... ఆ అక్కేనా మాట్లాడుతోంది అని వింతగా చూస్తున్నాడు. వెనువెంటనే అక్క చేతిని పట్టుకున్నాడు.

ఏదో గొప్ప శక్తి రమణ చేతిలోనుండి మల్లిక చేతిలోకి పాకినట్టయింది.

ఆ మంత్రముగ్ధత్వంలో నుండి రమణని బయిటికి లాగుతూ దూరంగా ఒక కప్ప నరాలు తెగిపోయేట్టుగా అరిచింది.

"అప్పన్నా తనామన్నా మారోరి భైరన్నా...
ఈ ఊరికి రాజును నేనేనన్నా... రాజును నేనేనన్నా...
యింక నేనేనన్నా... రాజును నేనేనన్నా... నేనన్నా"

తూలుతూ... పాట పాడుతూ...

"ఎవుర్రా అది... ఈ మనిషేనా?" అనుమానంగా చూసింది మల్లిక.

"యింకెవరై వుంటార్లే. రా పోయి పట్టుకొద్దాం. తప్పుతాదా," అంటూ ముందుకు కదిలాడు రమణ.

"యింకా రాలేదంటమ్మే మల్లికా," ముసుగు తీసి మరోసారి ప్రశ్నించింది ముసలి కన్నెమ్మ.

✦ ✦ ✦

ఎలక్షన్లొచ్చాయి... నాట్లొచ్చాయి... కోతలొచ్చాయి... మనుషుల్లో మార్పులొచ్చాయి... చావులొచ్చాయి... పుట్టుకలొచ్చాయి... వానలు మాత్రం రాలేదు.

మాలాడలో 'నల్లతంగ' నాటకం నాలుగుసార్లాడారు. అయినా వాన పడలేదు.

"అన్నా... ఆ మల్లిక వూరికి నీళ్ళు తేవాలని యమ్మెల్యే చుట్టూ తిరతావుండా దంటన్నా..." అప్పుడే కనుక్కున్న సత్యాన్ని ఆదరాబాదరాగా వచ్చి చెప్పాడు వెంకయ్య.

నారాయణరెడ్డి మొహం జేవురించి వుంది. తనకా విషయం ముందే తెలిసిందని చెప్పలేదతడు. కింది పెదవిని మునిపంటితో గట్టిగా నొట్టిపట్టి ఆలోచనలో పడ్డాడు. సర్పంచవగానే కొమ్ములొచ్చేసినట్టుండాయి దానికి అనుకున్నాడు. నా ప్రమేయం లేకుండానే యమ్మెల్యే చేసేస్తాడా అని కూడా అనుకున్నాడు.

అయినా ఈ పంచాయితీరాజ్ మహిళా కమీషన్ వల్ల ఎక్కడెక్కడి ఆడముండలంతా యమ్.పి.టి.సిలు, జడ్.పి.టి.సిలు, సర్పంచులుగా అయిపోతుండారు. బుద్ధిలేని

ప్రభుత్వం ఎవరికి అధికారమియ్యాలో వారికియ్యాల. ఈ మాలమాదిగ ఎధవల్నంతా యిట్టా సీట్లలో కూర్చునబెడితే యిట్నే కొమ్ములొస్తాయి. కింద పెదవి తెగుతున్నట్లుగా అనుమానమొచ్చి తేరుకున్నాడు నారాయణరెడ్డి.

"ఆ చంగయ్య యాడ సచ్చినాడ్రా... పనికిమాలిన యదవ. పెళ్ళాన్ని అదుపులో పెట్టుకోలేడంట్రా. మొన్న సంతకం కోసం యింట్లో వుండి కూడా లేనని చెప్పింది. ఒక్క సంతకంకోసం మూడుసార్లు తిప్పాల్సొచ్చింది," గర్జించాడు. అప్పటికి జేవురించిన నారాయణరెడ్డి ముఖం మీద చుక్కలుచుక్కలుగా చెమట చేరింది.

"మొగుడి మాట లెక్కచెయ్యడం లేదంటన్నా. అయినా ఆ మల్లిక్కి సపోర్టంతా దాని తమ్ముడేనంటన్నా. నాలుగుముక్కలు సదివినాడ్లే. అర్జీలు గిర్జీలు రాసిస్తుంటాడ్లే. పేట్లో తిరుమలాల్లో పన్జేస్తుండాడు. ఆ హా్రెడ్డి బటువు చూసుకునే వాడికంత లెక్కలేని తనం. అయినా మామాలోళ్ళకి పట్టుండే పొగురు ఎవురికీ పట్టలేదు పొన్నా..." చెప్పాడు వెంకయ్య.

వాళ్ళందరికీ నారాయణరెడ్డి అండకావాలి. అతడిచ్చే అప్పుసప్పు కావాలి. దొంగతనం గింగతనం... కేసులు, గీసులూ స్టేషన్లో చెప్పాల్సొస్తే నారాయణరెడ్డి మాట కావాలి. ఎవ్వరైనా పిలగాళ్ళను షుగర్ ఫ్యాక్టరీలో పెట్టాల్సొచ్చినా, గురుకుల పాఠశాల్లో చేర్చాల్సొచ్చినా అన్నిటికీ పెద్దాయన కావాల. నారాయణరెడ్డి కూడా వాళ్ళకి రకరకాల పనులు చేసి, కేసులు పెట్టించి, వాటినుంచి తప్పించి... యిట్లా వాడనంతా ఒక కట్టుగా తన అదుపులో వుంచుకున్నాడు. అందుకే మల్లికకి మొలిచిన ఈ చిన్న కొమ్ములు, చేసే స్వంత ప్రయత్నాలూ అతడికెంత మాత్రమూ మింగుడుపడ్డంలేదు.

"మనవేవన్నా చేతులు ముడుచుకోనుండామా... ఇంతకుముందు ఎన్నెన్నిసార్లు ఆఫీసుల చుట్టూ తిరగలేదు ఊరికి నీళ్ళుతేవాలని. మనూరు చుట్టుపక్కల పదమూడు కిలోమీటర్ల దాకా పైపులైన్లే లేకపాయె.ఊళ్ళో చూస్తే నాలుగొందల గడప మించకపాయె... ఇంత తక్కువమంది కోసం ప్రభుత్వం అంతంత డబ్బెట్ట ఖర్చుచేస్తదని ఆఫీసర్లు మన కంతా వివరంగా చెప్పలా," నీళ్ళమాటొచ్చినప్పుడల్లా ఎప్పుడూ చెప్పే కథనే మళ్ళీ చెప్పాడు నారాయణరెడ్డి తమ్ముడు క్రిష్ణారెడ్డి.

ఇప్పుడు నీళ్ళూ, మరుగుదొడ్లూ శాంక్షనైపోతే యింక వీళ్ళని పట్టేదానికుంటాదా? తక్షణ కర్తవ్యాన్ని ఆలోచిస్తోన్న నారాయణరెడ్డి ఎవరేం మాట్లాడుకుంటున్నారో అంతగా పట్టించుకోలేదు.

✦ ✦ ✦

"యాందిరా అది?... మనిషనుకుంటుండావా, దున్నపోతనుకుంటుండావా," చంగయ్య చేతిలోనుండి ముద్దగాన్ని యిసురుగా లాక్కుంది పక్కింటి రాజమ్మ. రాజమ్మ కేసి ఉరిమిచూస్తూ,

"మనం చాల్తామంట రాజక్కా... నేను మొదుటే చెప్పుళ్ళా? మనకొద్దు ఇయ్యంతా రెడ్డి చెప్పినట్టిని గమ్మున పడుంటామని. నా మాటిన్నాదా... మొగుడి మాటంటే కూడా లెక్కలేకపాయె," మళ్ళీ మల్లిక మీదకి దూకాడు చంగయ. "నోరు మూసుకుని పడుండు. బయటిక్కదిల్నావంటే కాళ్ళించతా..." హూంకరిస్తూ ధనధనా అడుగులేసుకుంటూ బయటి కెళ్ళిపోయాడు చంగయ్య.

"మొదుల్నాకు యింట్లోనే తీరులేదు పొక్కా," ఒళ్ళంతా తట్లుతేలి మంటలు రేగుతోన్నా మాట్లాడ్డం మానలేదు మల్లిక.

"గమ్మున కూలికి పాయ్యొచ్చి కూడొండుకుని తిని పడుంటే పోల్యా. నీ కెందు కొచ్చిందిదంతా. కొడతుంటే అయ్యో అన్పిస్తాది," కన్నెమ్మ గొణుక్కుంటూ గొణుక్కుంటూ కుండలో నీళ్ళుముంచి తెచ్చింది కోడలికి.

రాజమ్మ బలవంతంతో, ఆసరాతో రెండు గుక్కలు తాగి వెనక్కి వాలింది మల్లిక.

ఒంట్లో వీసమెత్తు సత్తవలేకపాయినా గుండె మాత్రం గట్టిగానే వుంది మల్లికకి. రెడ్డిమూలంగానే మొగుడిట్టా తనని గొడ్డును బాదినట్టు బాదాడని అర్థమౌతూనే వుందామెకి.

"నువ్వు దిగులుపడబాక మల్లికా, మనిళ్ళల్లో మొగుడు కొట్టేదేమైనా కొత్తా... ఏమైంది ఉన్నాడా యమ్మెల్యే," రాజమ్మ ధైర్యం చెప్పింది మల్లిక్కి.

"ఉంటాడంటేనే గదకా నేను పాయింది. ఏందో పోగ్రామంట... అక్కడ్నించట్నే రైలుకి టైమైందని ఎల్లిపాయినాడంట. పొద్దుగూట్లో పడేదాకా చూసిచూసి అవతల ఆఖరి బస్సుక్కదా వచ్చినాను. యాందో పొక్కా చావైపోతావుండాది..." కదుములు కట్టిన ఎడమ చేతిమీద కుడిచేత్తో సరుముకుంటూ పీలగా చెప్పింది మల్లిక. మళ్ళీ తనే, "కొత్త కలక్టరమ్మ మంచిదికా. మీ యమ్మెల్యే సంతకం పెడితే చేస్తానంటావుండాది. ఆ పొద్దు మనోళ్ళందరినీ తీసకపోయి వూరికి నీళ్ళు, కక్కసుదొడ్లూ కావాలని గట్టిగా కూర్చున్నాం చూడూ, అప్పట్నుండీ నాతో బాగా మాట్లాడతాదికా, ఏం చేసేది ఈళ్ళు సంతకాలు పెడితే గదా... గవర్మెంటేమో మనకి అన్ని సదుపాయాలూ చేస్తావుందికా ఈమద్దిలో వాళ్ళు రానిస్తేగదా మనదాకా," చింతపోయింది మల్లిక.

"ఆ గవర్మెంటుగూడ అంతేలేమ్మే... చిన్నోళ్ళ పేరుతో పెద్దోళ్ళకి సదుపాయాలు చేస్తారు. ఏమైనా ఆ పొద్దు మనందరం మాలాడ, మాదిగాడ ఆడోళ్ళందరినీ కలుపుకుని కలెక్టరమ్మకాడికి పొయ్యింది మంచిదైంది," చూర్లో దూర్చిపెట్టిన యిసనకర్రని లాక్కుని మల్లిక్కి మెల్లిగా విసురుతూ మాసిన చీర పైటకొంగుతో ముక్కుతుడుచుకుంది రాజమ్మ.

"నీళ్ళు రావాలక్కా... నీళ్ళొచ్చినాయనుకో యింక మనకి దిగుల్లేదు. వీళ్ళంతా నన్ను దిగలాక్కుండా వుంటే చాలుకా... మనం చెయ్యలేంది ఈ ఆడెదవ, అదీ కులం తక్కువది ఏంది చేసేదని వాళ్ళకి..."

"అది కాదులేమ్మే మనకి నీళ్ళొచ్చి మన అరెకరా కయ్యా పండిందనుకో... మనమేడ వాళ్ళ మాట యినకుండా పోతామో అని కదా. మనం లేకపోతే యీళ్ళు పంటలు పండించ్చుకోగలరంటమ్మే యింక... ఈ యిటిక సూల నాయుళ్ళు సూల ఏయిగలరా" కసిగా అంది రాజమ్మ.

ఏంచెయ్యాలో ఆలోచించుకుంటూ వెనక్కి వాలింది మల్లిక నీరసంగా.

టెంకాయచిప్పలోకి ఎర్రమట్టి నూరి దాంట్లో నిమ్మకాయరసం పిండి కర్ర తాటిచ్చుకుంటూ వచ్చింది కన్నెమ్మ కోడలి కదుములకి పట్టించడంకోసం.

✦ ✦ ✦

"మల్లికమ్మకీ జై... మావూరి సర్పంచ్‌కీ జై..." ఊరంతా జేజేలతో నిండిపోయింది. వాడ మనుషులైతే మల్లికను దేవతను చూసినట్లుగా చూస్తున్నారు.

వేదిక చిన్నదే అయినా చాలా పెద్ద పెద్ద వెలుతురున్న లైట్లతో అలంకరిస్తున్నారు. మంచి మంచి హుషారైన సినిమా పాటలు పాడి యువకులంతా మైకుని అదరగొట్టేస్తు న్నారు. ఊరూవాడా పక్కూరోళ్ళూ, కితకితమంటుండారు జనం. ఇసకేస్తే రాలడంలేదు.

తోమిపెట్టిన పెళ్ళినాటి చీర కట్టుకుని మల్లిక హడావిడిగా అటూయిటూ తిరుగు తోంది.

ఊరు ఊరంతా మల్లికని పొగుడుతోంది.

"అయినా మల్లికమ్మ సాధించిందిరా... చిన్నంగా తిరిగిందా ఆఫీసులచుట్టూ... అరవా కొరవా యమ్మెల్యే చుట్టూ చిన్నంగా తిరగలేదులే"

"ఒక దినం కూలికి పొయ్యేది... ఆ డబ్బులు పెట్టుకుని మర్రోజు పేటకు పొయ్యేది. చానా కర్చుపెట్టిందిలే... ఏమైనా మనోళ్ళలో తప్ప పుట్టింది మల్లికమ్మ."

"ఆఁ ఆ... ఇప్పుడు మాట్లాడతుండారయ్యా అందురూ... వొక్కడన్నా మొగోడు మన వాడల్లో నుండి మాకు సపోటు వచ్చినారా... దిగలాగిపారేస్తిరే మమ్మల్నంతా... యిప్పుడొచ్చినారు మల్లికమ్మని పొగడ్డానికి. ఏడుక చూడ్డానికి..." వాళ్ళ సందులో నుండి విసురుగా మాట్లాడుకుంటూ వేదిక పక్కకి వెళ్ళింది రాజమ్మ.

"అదిగదిగో యమ్మెల్యే వచ్చేసినాడు... కలెక్ట్రమ్మొచ్చింది... రా... రా మళ్ళ చూద్దుగానీ," రాజమ్మ వంకే వింతగా చూస్తోన్న వృద్ధుడ్ని చేయి పట్టి నడిపించాడు మనవడు.

"ఒరే యమ్మెల్యే ఏందిరా కొళాయి తిప్పేది... మన మల్లికమ్మ తిప్పాల్రా," గుండెలు చరుచుకుంటూ అన్నాడు వృద్ధుడు.

"నోరుమూసుకో యింటాడు... చూడు చూడు మల్లికమ్మకి కూడా శాలవ కప్పినారు మన పిలకాయలు..."

చప్పట్ల మోత... మాటల గలగల...

"సోదర సోదరీమణులారా... మీ ఊరు ధన్యమైపోయింది. ఎన్నో ఏళ్ళుగా ఎందరో ప్రయత్నించి చేయలేని పని మీ సర్పంచి చేసింది. ఇటువంటి సర్పంచిని ఎన్నుకున్నందుకు మీరంతా అదృష్టవంతులు. నీళ్ళు వచ్చాక యింక మరుగుదొడ్లు కట్టించుకోవడం పెద్ద కష్టంకాదు. మన యమ్మెల్యేగారి సహకారంతో అది కూడా మీకు తొందర్లోనే శాంక్షన్ అవుతుంది..."

చప్పట్ల మోత... తన మూలంగానే ఈ కార్యం సాధ్యమైందన్నట్లు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ తనూ చప్పట్లు కొట్టాడు నారాయణరెడ్డి.

కొళాయి తిప్పి ప్రారంభం చేశాడు యమ్మెల్యే.

"గర్ర్... గజ్... జ్... ర్... ర్.." మంటూ ఎక్కడ్నుండో దూసుకువస్తోన్న చప్పుడు. ఈ సారి అది గాలికాదు... నీళ్ళు... నీళ్ళు... నీళ్ళు... నీళ్ళే నీళ్ళు... ధారగా నీళ్ళు... దిగుల్లేకుండా నీళ్ళు... నీళ్ళు...

ఉలిక్కిపడింది మల్లిక... ఆమె కళ్ళనిండా నీళ్ళు.

నిద్రో మెలకువో అర్థంకాని స్థితి. లోలోపల ఏదో కదుల్తోంది.

కడుపులో మంట. ఆకలి మంట... నీర్సంతో వొళ్ళు తూలుతోంది.

పార్కులోని సిమెంటు బెంచిమీద ఒత్తిగిలి లేవాలని ప్రయత్నించి పడబోయి నిలదొక్కుకుంది మల్లిక. ఆమె మొండి చేయి వెక్కిరించింది. దుఃఖాన్ని ఆపుకోడం కష్టమైపోయిందామెకు.

యిల్లు కావాలనుకుందా... వాకిలి కావాలనుకుందా... గుడ్డకావాలనుకుందా... గ్రాము బంగారు కావాలనుకుందా... సర్పంచికావాలనుకుందా... ఏపొద్దన్నా అత్త నొక మాటనిందా... మొగుడ్ని ఎదిరిచ్చుకుందా... ఆఖరాకి పిలకాయలు కావాలని యాడ్యాడికో పొమ్మని అందరూ చెబితే కూడా పుడితే పుట్టారు లేకపోతే లేదనుకొనేసింది. అట్టాటిది ఊరికి నీళ్ళు కావాలనుకున్నందుకు వాళ్ళడిగినట్టల్లా సంతకాలు పెట్టనందుకు అందరూ కలిసి తననింత గతి చేశారు.

కళ్ళు తుడుచుకోవాలని కూడా అనిపించలేదు మల్లికకి.

తప్పుడు కేసు పెట్టి మొగుడ్ని బొక్కలో తోయిస్తిరి. ఎట్టెట్ట తిరిగింది యిడిపిచ్చుకోవాలని... ఆఖరాకి మనిషినే ల్యాకుండా చేసేస్తిరి. ఎట్ట చేసినారో ఏమో... మొగుడు పాయె, మానంపాయె, ముసలి అత్త పాయె... చెయ్యి కూడా పాయె.

తక్కువ కులమోళ్ళు సొంతంగా వొక్కపని కూడా చేసుకోకూడదు... వొక్కరెవ్వరైనా ధైర్యంచేస్తే తప్పుడు కేసులుపెట్టి తోక కత్తిరించి పారేస్తారు. అందరూ అదుపులో వుండాల. రెడ్డి అందరికీ అండగా వుంటాడు. మొండి చేతిని తడుముకుంటూ నారాయణరెడ్డి వంశాన్ని శాపనార్థాలు పెట్టింది మల్లిక.

అన్నిటీనీ కూడ లెక్కచెయికుండా తమ్ముడి సాయంతో, హేలు రెడ్డి అండతో నీళ్ళ పైపులు శాంచను చెయ్యించుకొచ్చింది. పైపులు తెచ్చి వూళ్ళో దింపిననాటి రాత్రే తన మీద దాడి జరిగింది. యింటిమీదికొచ్చినారు రెడ్డోరి మనుషులు... రమణడు కర్ర తీసుకోని ఎదురుబొయినాడని వాడి కాళ్ళు, తన చేయి నరికి యిల్లు తగలబెట్టేసి పాయినారు.

జరిగిన సంఘటనలన్నీ మళ్ళీ మళ్ళీ తలుచుకుంటూ కళ్ళు తుడుచుకుంది మల్లిక. అసలు మర్చిపోయిందెప్పుడని... ఇప్పుడు గ్రీవెన్స్ సెల్లంట దాని చుట్టూరా తిరుగుతా వుంది.

"మహిళలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే వారికి చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం వుంది. మహిళల సాధికారత మూలంగానే మహిళా భివృద్ధి జరుగుతుంది."

"మహిళలూ... వివక్ష... సాధికారత... స్త్రీలు"

పార్కులో మహిళాదినోత్సవమేదో జరుగుతున్నట్లుగా వుంది.

రాజకీయనాయకుడెవరో మహిళా సాధికారత మీద అనర్గళంగా మాట్లాడు తున్నాడు. గాలిలో ముక్కలుముక్కలై తేలివస్తోన్న మాటల్ని వింటూ, తన మొండి చేయిని తడుముకుంటూ... బెంచి మీదికి మోకాళ్ళు చేర్చి, అందులో తలదూర్చుకుని కళ్ళు మూసుకుంది మల్లిక.

ఊరు, మాలాడా, యిల్లూ, అరుగుమీద అత్తా... వాకిట్లో యాపచెట్టూ... వుండుండి టైరుబండి మీద రాలుతోన్న ఎండు కొమ్మలు... ఖాళీ నీళ్ళబిందెలు, వీధిబాయి గిలకల సంగీతం... గెలిచిన్నాటి ఓట్ల శబ్దం... నీళ్ళ పైపులు... కొళాయిలు... మసకమసగ్గా.

గర్ర్... గజ్... ర్... ర్... పైపు ల్లోలోపలి నుండీ... ఎక్కడ్నుండో దూసుకొస్తోన్న గాలి... గాలి...

గాలి మాత్రం యింకా మిగిలేవుంది ప్రపంచంలో.